## పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ : ఎమ్మెల్యే


సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొత్తపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు అండ అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ వాసి నర్సింహ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేరారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆస్పత్రిలో ఆపరేషన్ ఖర్చులను భరించే స్తోమత లేదని ఆయన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను సంప్రదించారు. అతడి ఆపరేషన్ ఖర్చుల వివరాలతో ఆర్థిక సాయం కోసం ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఆదివారం రూ.2లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీని ఆయన నర్సింహ కుమారుడైన కిరణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, నాయకులు రుద్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలికి ఎల్ఓసీ అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

## నిరుపేదలకు వరం : మధుయాష్కీగౌడ్

చంపాపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీకి చెందిన రిజ్వాన్‌ఖాన్ అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కోసం మధుయాష్కీని సంప్రదించారు. ఆయన చొరవ చూపించి రిజ్వాన్‌ఖాన్ రూ.2.50లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. సదరు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ చెక్కును బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్, రామ్మోహన్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రవికిరణ్‌ని అభినందిస్తున్న కాలనీవాసులు

## భూలక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రధాన కార్యదర్శిగా రవికిరణ్ పొనుగుపాటి ఎన్నికయ్యారు. ఆదివారం కాలనీలో జరిగిన ఎన్నికల్లో కాలనీవాసులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాశీపతి, ప్రధాన కార్యదర్శిగా రవికిరణ్ పొనుగుపాటి, ఉపాధ్యక్షులుగా కంబపు శ్రీధర్, సహాయ కార్యదర్శిగా సామ దామోదర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి.రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి రవికిరణ్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు కృషి చేసిన కాలనీవాసులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వెంకటగిరికాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

సైదాబాద్ : సైదాబాద్ డివిజన్ ఎస్‌బీహెచ్ స్టాఫ్ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలోని శ్రీవెంకటగిరి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వి.రామకృష్ణ నియమితులయ్యారు. ఆదివారం జరిగిన కాలనీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పాపిరెడ్డి, కె.వి.మురళీధర్, కార్యదర్శిగా రమేశ్, సంయుక్త కార్యదర్శులుగా ఆనంద్, జగన్నాథం, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా హయత్‌ఖాన్, సభ్యులుగా శ్రీధర్, ఆనంద్, జానకి, సుధీర్, మధుకర్, రాజేంద్రప్రసాద్, బాలమురళీ ఎన్నికయ్యారు.


విద్యాధరచారికి అవార్డు అందజేస్తున్న జస్టిస్ సూరేపల్లి నంద

## విద్యాధరచారికి కామదేను అవార్డు

చంపాపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సూక్ష్మకళాఖండాల నిపుణులు డాక్టర్ ముంజంపల్లి విద్యాధరచారికి కామదేను అవార్డు-2024ను హైకోర్టు జస్టిస్ సూరేపల్లి నంద అందజేశారు. ఆదివారం బేగంపేట టూరిజం ప్లాజాలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ సీఈఓ సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో అవార్డు ప్రదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం అంగడి కుర్మపల్లికి చెందిన విద్యాధరచారి సూక్ష్మదర్శినితో చేస్తే తప్ప కనిపించని సూక్ష్మ కళాఖండాలను సృష్టించడంలో దిట్ట. ఆవగింజపై వినాయకుడి చిత్రంతో పాటు జై గణపతికి జై అంటూ తెలుగు అక్షరాలతో, తలవెంట్రుకపై ఏపీజే అబ్దుల్ కలాం ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అంటూ ఆంగ్ల అక్షరాలు రాసి అభినందనలు అందుకున్నారు.


నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరిగిన చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ కుమార్తె వివాహ వేడుకల్లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో మంద కృష్ణమాదిగ, వీహెచ్ హనుమంతరావు, జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా తదితరులు పాల్గొన్నారు. - సైదాబాద్, ఆంధ్రజ్యోతి

### శాఖ గ్రంథాలయం..

# సౌకర్యాల్లో అధమం

- నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న గ్రంథాలయం
- ఆధునికీకరణకు నోచుకోని సైదాబాద్ కాలనీ లైబ్రరీ



సైదాబాద్ కాలనీలో అద్దెభవనంలో గ్రంథాలయం

సైదాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 54 ఏళ్లుగా కొనసాగుతున్న సైదాబాద్‌కాలనీ శాఖ గ్రంథాలయం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. అద్దె భవనంలో అరకొర వసతులతో నిర్వహణ సాగుతుంది. 1970 నవంబరు 11న ఏర్పాటు చేసిన సైదాబాద్‌శాఖ గ్రంథాలయం అప్పటి నుంచి అద్దె భవనాలలో కొనసాగుతుంది. 52 ఏళ్ల ఒకే అద్దె భవనంలో కొనసాగగా, రెండేళ్ల క్రితం సమీపంలో మరో అద్దె భవనంలోకి మార్చారు. హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ లైబ్రరీ నిత్యం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటుంది. ఈ గ్రంథాలయంలో సుమారు తెలుగు 15,591 ఆంగ్లం 2,155, హిందీ 460, ఉర్దూ 869, తమిళం మరాఠీ, సంస్కృతం కలిపి మొత్తం 19,478 పుస్తకాలు అందుబాటులో ఉన్నా యి. దీనికి తోడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోలేకపోతుండడంతో నేటి తరం విద్యార్థులను ఆకర్షించలేకపోతున్నాయి. రెండు ఇరుకు గదుల్లో ఉన్న ఈ గ్రంథాలయంలో పుస్తకాలు, దినపత్రికలు భద్రపరిచేందు కు స్థలం లేకపోవడంతో సిబ్బంది నానాయాతనలు పడుతున్నారు.


ఇరుకు గదులలో అమర్చిన పుస్తకాలు

### డిజిటలైజేషన్ చేస్తేనే ఆదరణ

యువత టీవీలు, మొబైల్ ఫోన్, ఇంటర్నెట్, వాట్సప్‌లకు అతుక్కుపోతూ గ్రంథాలయాలకు వెళ్లేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇందుకు కార ణం వారికి కావాల్సిన పుస్తకాలు అక్కడ అందుబాటులో ఉండకపోవడం కూడా కావచ్చు. గ్రంథాలయాలలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ, రాజ్యాంగం, చరిత్ర, రీజనింగ్, ఆర్థమెటిక్, ఆప్టిట్యూడ్, భూగోళ శాస్త్రం, కంప్యూటర్ కోర్సులకు సంబంధించిన తాజా సమాచారంతో కూడిన పుస్తకాలు, టీఎస్ఎస్‌పీఎస్‌సీ పోటీ పరీక్షల పుస్తకాలు అరకొర అందుబాటులో ఉంటున్నాయి. ముఖ్యంగా పేద నిరుద్యోగ యువత మార్కెట్‌లో వేలాది రూపాయలు పెట్టి పుస్తకాలు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు.

### కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు



సైదాబాద్‌కాలనీలో శాఖ గ్రంథాలయం 54 సంవత్సరాలుగా అద్దె భవనంలో కొనసాగుతుంది. ఈ భవనంలో వెంటిలేషన్ సక్రమంగా లేకపోవడంతో చీకటి గదులు తలపిస్తున్నాయి. ఎలుకలు స్వైరవిహారం చేస్తుండడంతో విలువైన పుస్తకాలు నాశనమవుతున్నాయి. ఇప్పటికైనా తీవ్రతను గుర్తించి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

**- జనపాల మధు, మాదన్నపేట**

### లైబ్రరీని ఆధునికీకరించాలి



సైదాబాద్‌కాలనీ లైబ్రరీని ఇప్పటికైనా ఆధునికీకరించాలి. కంప్యూటర్ల ఏర్పాటు, ఇంటర్‌నెట్ సౌకర్యానికి తోడు తెలంగాణ ఉద్యమం, ఉద్యమకారుల జీవితచరిత్రలు సహా అన్ని రకాల పుస్తకాలు, తాజా సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి. గ్రంథాలయాలన్నింటిని డిజిటలైజేషన్ చేస్తే సత్ఫలితాలను పొందవచ్చు.

**- జోగు సాయివిగ్నయ్‌సాగర్, విద్యార్థి**

### ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే



భవనం ఇరుకుగా ఉండడంతో కొంతమేర ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. సమీప ప్రాంతాలలో అద్దె భవనం దొరకడం కష్టంగా మారింది. ఈ భవన యజమాని తిరుమల తిరుపతి దేవస్థానానికి దానం చేశారు. అందుకు టీటీడీకి నెలకు రూ.8,500 అద్దె చెల్లిస్తున్నాం. ఉచితంగా ఇవ్వాలని అభ్యర్థించాం. అన్నింటిని అధిగమించి పాఠకులకు సమస్యలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. పోటీ పరీక్షలకు హాజరై యువతకు పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నాం.

**- హరిశంకర్, ఇన్‌చార్జి లైబ్రేరియన్, సైదాబాద్‌కాలనీ శాఖ గ్రంథాలయం**

## ఆర్థికపరమైన అంశాల్లో అప్రమత్తత, పారదర్శకత ముఖ్యం

- స్ఫూర్తి గ్రూప్స్ సీఈవో హోలీధర్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న హోలీధర్‌రెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్థికపరమైన అంశాల్లో అప్రమత్తత, పారదర్శకత ఎంతో ముఖ్యమని, అవి లోపిస్తే ఆర్థిక వ్యవస్థలో ఆటుపోట్లు తప్పవని స్ఫూర్తి గ్రూప్స్ సీఈవో హోలీధర్‌రెడ్డి అన్నారు. బడంగ్‌పేట్‌లోని ఓ జూనియర్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన కామర్స్ ఫెస్ట్-2024లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హర్షద్ మెహతా స్కామ్, ఖేతన్ పరేఖ్ స్కామ్, సత్యం రామలింగరాజు స్కామ్, అనిల్ అంబానీ స్కామ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం, రమేష్‌గెల్లి స్కామ్ తదితర కుంభకోణాలకు ఆర్థిక వ్యవహారాల్లోని లోపాలే ప్రధాన కారణమని అన్నారు. కామర్స్ విద్యార్థులు ఆర్థిక వ్యవహారాల పట్ల సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, అనేక సంస్థలు కామర్స్ అభ్యర్థుల కోసం వేచి చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ పాండు, చైర్మన్ జగన్‌మోహన్‌రావు, డైరెక్టర్లు ఎన్.నాగేంద్ర, లగడపాటి, ప్రిన్సిపాల్లు శ్రీనివాస్‌రెడ్డి, నవనీత, కామర్స్ విభాగాధిపతి శ్రీధర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


కాటమయ్య విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాహుల్‌గౌడ్

## ఘనంగా కాటమయ్య గుడి శిఖర ప్రతిష్ఠాపన

కొత్తపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సత్యానగర్‌లో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్యగుడి శిఖర ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. రావిరాల పరమేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సురమాంబ సమేత, కంఠమహేశ్వర, శ్రీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, నందీశ్వర విగ్రహాలు సహా, వనమైసమ్మ, రేణుకాదేవి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం, శిఖర ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.


ఫైనల్‌లో నెగ్గిన బద్రుక జట్టు

## నెట్‌బాల్ విజేత 'బద్రుక'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంతర్ కళాశాలల నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో బద్రుక కామర్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో బద్రుక జట్టు 11-6తో సిద్దార్థ కళాశాలపై నెగ్గింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో బద్రుక 9-2తో అవంతి కళాశాల జట్టుపై గెలిచి, ఫైనల్ చేరింది.



ఎమ్మెల్యేలు రాకేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డిల సమక్షంలో బీజేపీలో చేరిన భల్‌దేవ్‌రెడ్డి

## బీజేపీలో చేరిన కందాల భల్‌దేవ్‌రెడ్డి

హయత్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడా గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ వేత్త, తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కందాల భల్‌దేవ్‌రెడ్డి బీజేపీలో చేరారు. శనివారం సరూర్‌నగర్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో బీజేపీ ఎమ్మెల్యేలు రాకేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డిల సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి ప్రధానమంత్రి చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాల అమలు, దేశ రక్షణ విషయంలో మోదీ నిర్ణయాలకు ఆకర్షితుడనై బీజేపీలో చేరానని తెలిపారు. బీజేపీలో తనకు అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు కొత్త అశోక్‌గౌడ్, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, కొహెడాకు చెందిన సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ సానెం అర్జున్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బూర మహేష్, ఎంజాల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్బీసీ రాంరెడ్డి, భిక్షపతిలకు కృతజ్ఞతలు తెలిపారు.


నూతన కార్యవర్గ సభ్యులు

## తెలంగాణ స్క్వాష్ అధ్యక్షుడిగా రవి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ స్క్వాష్ రాకెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఎల్బీనగర్‌లోని ఒక హోటల్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో రవితో పాటు ఉపాధ్యక్షులుగా టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌గౌడ్, ఎస్.శ్రీనివాసుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా వి.వంశీనాథ్, కోశాధికారిగా జి.అరవింద్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా జాతీయ స్క్వాష్ సంఘం నుంచి పి.మురళీధరన్, శాట్ నుంచి డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

## లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నార్సింగ్ : ఔటర్‌రింగ్ రోడ్డుపై అప్పాచౌరస్తా వద్ద ఎదురుగా వెళ్తున్న ఓ లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక విచారణ చేపట్టిన నార్సింగ్ పోలీసులు వీరిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే బాధితులు ఫిర్యాదు చేయాల్సి ఉందని, ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి ఇతర వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. మంచు ప్రభావంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు భావిస్తున్నారు.

## కార్పొరేటర్ భర్తపై అట్రాసిటీ కేసు నమోదు

- కాంట్రాక్టు డబ్బులు చెల్లించాలన్నందుకు కులం పేరుతో దూషించి దాడి

చాదర్‌ఘాట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చేసిన కాంట్రాక్టు పనులకు చెల్లించాల్సిన బకాయిలను అడిగేందుకు వెళ్లిన వారిపై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించాడంటూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్కేపురం కార్పొరేటర్ భర్త పై చైతన్యపురి పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. చైతన్యపురి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట నివాసి దాసరి హనుమయ్య కాంట్రాక్టర్ ఆర్కేపురం కార్పొరేటర్ భర్త ధీరజ్‌రెడ్డి నుంచి సబ్ కాంట్రాక్టర్‌గా సీతారామయ్య ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు 7 పనులు చేసినందుకు గాను రూ. 31 లక్షలు కాంట్రాక్టర్ హనుమయ్యకు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు అడిగేందుకు హనుమయ్య, బానోతు భాస్కర్, దాసరి కిషన్ కడెం శివాజీ, వల్లపు వంశీ, అముదాల నరసయ్యతో కలిసి శనివారం కొత్తపేటలోని ధీరజ్‌రెడ్డి కార్యాలయానికి వెళ్లారు. అక్కడ డబ్బులు విషయం మాట్లాడుతుండగా.. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. తనకు రూ. 31లక్షలు ఇవ్వాలని హనుమయ్య చెప్పగా.. కేవలం రూ. 16లక్షలే ఇస్తానంటూ ధీరజ్‌రెడ్డి తెలిపారు. అనంతరం జరిగిన వాగ్వాదంలో ధీరజ్ రెడ్డి కోపంతో ఊగిపోతూ హనుమయ్య వెంట వచ్చిన వారిపై దాడి చేయడంతో పాటు భాస్కర్‌ను కులం పేరుతో దూషించాడు. దాంతో హనుమయ్య, భాస్కర్ ఇరువురు కలిసి చైతన్యపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ధీరజ్‌రెడ్డి పై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తన వెంట ఉన్న ప్రవీణ్ అనే వ్యక్తిని కులం పేరుతో హనుమయ్య దూషించాడంటూ ధీరజ్‌రెడ్డి అనుచరుడు ప్రవీణ్ చైతన్యపురి పోలీసులకు హనుమయ్యపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు.

## సైబర్ నేరాల డబ్బు రికవరీలో దేశంలోనే తెలంగాణ టాప్

- ఈ ఏడాదిలో రూ. 140 కోట్లు రికవరీ చేసి.. బాధితులకు అందజేశాం : డీజీ శిఖాగోయల్


ప్రసంగిస్తున్న శిఖాగోయల్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలను ఛేదించి, డబ్బు రికవరీ చేయడంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే టాప్‌లో ఉందని డీజీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ పేర్కొన్నారు. హైటెక్స్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం జరిగిన టెడెక్స్ 10వ ఎడిషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 170 రకాల మోసాలతో సైబర్ క్రిమినల్స్ మీ డబ్బును దోచుకుంటారని తెలిపారు. సుమారు 1200 మంది హాజరైన ఈ కార్యక్రమానికి ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఎంతో మంది రక్షించిన ట్యాంక్‌బండ్ శివ, సినీ దర్శకుడు నిర్మాత నాగ్ అశ్విన్, రవి ప్రభు, డాక్టర్ ప్రహ్లద్ రామారావు ప్రఖ్యాత ఏరోస్పేస్ శాస్త్రవేత్త, ఎన్డీటీవీ ఎడిటర్ ఉమా సుధీర్, వహరేవాహ్ వెబ్‌సైట్ చెఫ్ సంజయ్ తుమ్మా, రాజ్యసభ ఎంపీ అయోధ్య రామిరెడ్డి తదితరులు హాజరై ప్రసంగించారు.


ఎన్జీవోస్ కాలనీలోని ప్రధాన రహదారిపై పారుతున్న డ్రైనేజీ నీరు

## చిన్నపాటి వర్షానికే పొంగిన డ్రైనేజీలు


వనస్థలిపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదివారం తెల్లవారుజామున కురిసిన చిన్నపాటి వర్షానికే బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. అందులో భాగంగా వనస్థలిపురం ఈ సేవ కేంద్రం నుంచి వైదేహినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోని చర్చి ముందర డ్రైనేజీ నీరు రోడ్డుపై ఏరులై పారడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నాలాల్లో పేరుకపోయిన మట్టి, ఇతర వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడు తొలగించడంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి ప్రజా సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.



సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విగ్రహాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభ ఏర్పాట్లను చేస్తున్న కార్మికులు



ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సెక్రటేరియట్ సమీపంలోని హెచ్ఎండీఏ మైదానంలో ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి నిర్వహించారు. వీటిని తిలకిస్తున్న ఆహుతులు


**ట్రాఫిక్ జంఝాటం**

ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన ఎయిర్‌షో ముగిసిన తర్వాత సెక్రటేరియట్ మార్గంలో ట్రాఫిక్ జామ్